మరో ప్రజా సంకల్పం

బుధవారం, 18 నవంబరు 2026 | Evening News Bulletin | పేజీలు : 5

ప్రతి రోజూ సాయంత్రం మరో ప్రజాసంకల్పం ఈ-పేపర్‌లో వచ్చే సమాచారం కోసం ఈ QR కోడ్‌ను స్కాన్ చేసి వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి.

వైఎస్ఆర్ జిల్లా చక్రాయపేట మండలం సురభి గ్రామంలో వైయస్సార్ సీపీ కార్యకర్తలపై రాళ్లు రువ్విన టీడీపీ గుండాలు... వైయస్సార్ సీపీ కార్యకర్తలకు గాయాలు...







పులివెందుల నామినేషన్ కేంద్రం వద్ద దాడి.. టీడీపీ మూకల దాడిలో మాలిక్‌కు గాయాలు

పచ్చమూక రౌడీయిజం..

కొనసాగిన గూండారాజ్

పంచాయతీ ఎన్నికల్లోనూ టీడీపీ అరాచకాలు

నామినేషన్ వేసేందుకు కూడా స్వేచ్ఛ లేదు



కమలాపురం మండలం పాచికలపాడు నామినేషన్ కేంద్రం వద్ద వైయస్ఆర్‌సీపీ నాయకుడు సమ్మటూరు ప్రసాద్‌రెడ్డిపై దాడి.. రక్తగాయాలతో ఆస్పత్రికి తరలింపు

- పోలీసులు, పచ్చ గూండాలు కుమ్మక్కు
- వైయస్సార్‌సీపీ నేతలపై దాడులు, దౌర్జన్యాలు
- రాష్ట్ర వ్యాప్తంగా పేట్రేగిపోతున్న టీడీపీ కాలకేయులు
- వేములలో రాళ్ల దాడి.. మాలిక్, గంగులయ్య, బ్రహ్మారెడ్డికి తీవ్ర గాయాలు
- భద్రంపల్లిలో మహిళా అభ్యర్థి ఉమాదేవిపై దాడి.. చేతికి తీవ్ర గాయం
- క్రోసూరులో మహిళలపై విరిగిన లాఠీలు..
- సురభిలో రాళ్ల వర్షం.. చక్రాయపేటలో పెట్రోల్ బాంబులు, సీసాలతో దాడులు
- పాచులపాడులో వైయస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిపై కర్రలతో దాడి
- రాయలపేటలో అధికారి చేతికి అందేలోపే హేమచంద్ర నామినేషన్ చించివేత
- నసనకోట నుంచి నుంకేసుల దాకా.. అభ్యర్థుల చేతుల్లోంచి పత్రాలు లాక్కొని చించేశారు
- వేంపల్లిలో షబ్బీర్‌కు ముళ్లకంచె.. బీటెక్ రవి అనుచరులకు మాత్రం స్వేచ్ఛ
- రొంపిచర్లలో నామినేషన్ కేంద్రానికి తాళం.. వస్తే కేసులు పెడతామని ఎస్ఐ బెదిరింపులు

> దాడులు, దౌర్జన్యాలు, అడ్డగింతలు, నామినేషన్లు లాక్కోవడం, చించేయడం, పోలీసులే దగ్గరుండి పచ్చమూకలకు సహకరించడం.. స్థానిక ఎన్నికలతో పాటు పంచాయతీ ఎన్నికల్లోనూ ఇదే పంథా కొనసాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ దాష్టీకాలు అన్నీఇన్నీ కావు. యథేచ్ఛగా అడ్డగోలుగా దారుణకాండ కొనసాగిస్తున్నారు. అడ్డూ అదుపు లేకుండా చెలరేగిపోతున్నా పోలీసులు, ఎస్ఈసీకి కనిపించడం లేదు. వైయస్సార్‌సీపీ శ్రేణులు కనీసం నామినేషన్లు వేసే స్వేచ్ఛను కూడా హరిస్తున్నారు. తలలు పగిలేలా కొడుతూ, దాడులకు తెగబడుతూ రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్నారు.

- మిగతా 2-4 పేజీల్లో..



పల్నాడు జిల్లాలో నామినేషన్ల వేళ ఉద్రిక్తత.. నాగవరంలో వైయస్సార్ సీపీ నాయకులపై పోలీసుల లాఠీఛార్జ్, పలువురు మహిళలకు గాయాలు



అలవలపాడు క్లస్టర్ పరిధిలో వైయస్సార్ సీపీ సానుభూతిపరులు అభ్యర్థులను అడ్డుకుంటున్న పోలీసులు, టీడీపీ గుండాలు, కింద పడిపోయిన మహిళ



వైఎస్ఆర్ జిల్లా చక్రాయపేట మండలం సురభి గ్రామంలో వైఎస్ఆర్సీపి కార్యకర్తలపై రాళ్లు రువ్విన టీడీపీ గుండాలు...



పుంగనూరు నియోజకవర్గంలో పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ నేతలు దౌర్జన్యం

కొనసాగిన గూండారాజ్



ఇడుపులపాయలో వైయస్ఆర్సీపీ సర్పంచ్ అభ్యర్థిని అడ్డుకున్న పచ్చ మూకలు



అలవలపాడు క్లస్టర్ పరిధిలో వైయస్సార్ సీపీ అభ్యర్థులను అడ్డుకుంటున్న పోలీసులు, టీడీపీ గుండాలు

రాయలసీమలో దమనకాండ

రాయలపేటలో హేమచంద్ర నామినేషన్ పత్రాలను అధికారికి అందించబోతుండగా చేతుల్లోంచి లాక్కొని చించేశారు. భద్రంపల్లిలో నామినేషన్‌కు వెళ్లిన ఉమాదేవిపై దాడికి పాల్పడగా చేతికి తీవ్ర గాయంమైంది. వేములలో సర్పంచ్ అభ్యర్థులు కేంద్రానికి చేరుకునేలోపే హైస్కూల్ దగ్గర పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత రాళ్ల దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎన్నికల నామినేషన్ల వేళ పలు జిల్లాల్లో పచ్చ రాబందుల దమనకాండ కొనసాగింది. అభ్యర్థి తన పత్రాన్ని ఎన్నికల అధికారి చేతికి అందించడానికే ఇన్ని అడ్డంకులు దాటాలంటే.. ఆ గ్రామంలో ఎవరెవరు పోటీ చేయాలో నిర్ణయిస్తున్నది అధికార పార్టీ నేతలా? ప్రజలా? అనేది ఇట్టే తెలిసిపోతోంది. పులివెందుల నియోజకవర్గంలో రెండో విడత నామినేషన్లు మొదలయ్యే ముందురాత్రే ఒత్తిళ్లు మొదలయ్యాయని అభ్యర్థుల కుటుంబాలు చెబుతున్నాయి. కణంపల్లిలో అర్ధరాత్రి ఇంటికొచ్చి భర్త ఎక్కడున్నాడని అడిగారని, ఫోన్‌లో చిత్రీకరిస్తే లాక్కున్నారని గ్రామస్థులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. తెల్లారేసరికి వేంపల్లిలో అభ్యర్థికి ముళ్లకంచె ఎదురైంది. వేములలో రాళ్లు పడ్డాయి. సుంకేసులలో అభ్యర్థి చేతిలోని పత్రాలు చించేస్తుంటే అక్కడున్న పోలీసులు పక్కకు తప్పుకున్నారు.

పల్నాడులో మహిళలపై దాడులు

పల్నాడులో టీడీపీ మూల దాడులకు మహిళలను ఆస్పత్రికి తరలించే పరిస్థితి దాపురించింది. అనంతవరం అభ్యర్థులను ఎక్కడికి తీసుకెళ్తున్నారని ప్రశ్నించిన మహిళలపై పోలీసులు లాఠీలు ప్రయోగించారని వైయస్సార్సీపీ నేతలు తెలిపారు. చిత్తూరు జిల్లా రొంపిచర్లలో కేంద్రానికి తాళం వేశారని అభ్యర్థులు రోడ్డుపై బైఠాయించారు. ఎన్నికలకు పటిష్ట భద్రత కల్పించామని నవంబర్ 17న ఐజీ బి.రాజకుమారి ప్రకటించారు. కానీ ఆ భద్రత నామినేషన్ పత్రం పట్టుకుని వచ్చిన అభ్యర్థికి ఎందుకు అందలేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు. కేంద్రాల వద్ద భద్రత కల్పించి అభ్యర్థులతో నామినేషన్లు వేయించాలని వైయస్సార్సీపీ నేతలు వరుసగా రెండో రోజూ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు.



ఇడుపులపాయ సర్పంచ్ అభ్యర్థిని అడ్డుకున్న పచ్చ మూకలు



దర్శి నియోజకవర్గం చౌటపాలెంలో వైయస్ఆర్సీపీ నామినేషన్‌ను అడ్డుకునేందుకు కర్రలతో వచ్చిన టీడీపీ గుండాలు

కొనసాగిన గూండారాజ్

రెండో విడత తొలి రోజే రాక్షసకాండ

- **వేముల, వైఎస్సార్ జిల్లా: ముగ్గురికి తీవ్ర గాయాలు. వేముల, పెండ్లూరు, వి.కొత్తపల్లి, గొందిపల్లి, మబ్బుచింతలపల్లె క్లస్టర్ అభ్యర్థులు నామినేషన్లకు బయలుదేరారు. వేముల హైస్కూల్ వద్ద డీఎస్పీ మురళీనాయక్, పోలీసులు సర్పంచ్ అభ్యర్థులను అడ్డుకున్నారని వైయస్సార్‌సీపీ నేతలు తెలిపారు. నామినేషన్ కేంద్రం వద్ద టీడీపీ వర్గీయుల రాళ్ల దాడిలో మాలిక్, గంగులయ్య, బ్రహ్మారెడ్డి తీవ్రంగా గాయపడ్డారని, చలపతిపైనా దాడి జరిగిందని వివరించారు.**
- భద్రంపల్లి, తొండూరు మండలం: ఉమాదేవి చేతికి గాయం. నామినేషన్ వేసేందుకు వెళ్లిన వైయస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి ఉమాదేవిని టీడీపీ వర్గీయులు అడ్డుకుని దాడి చేశారని స్థానిక పార్టీ నేతలు తెలిపారు. దాడిలో ఆమె చేతికి తీవ్ర గాయమైంది.
- **అనంతవరం–నాగవరం, పల్నాడు జిల్లా: మహిళలపై లాఠీచార్జి. నాగవరంలో నామినేషన్లకు వెళ్తున్న అనంతవరం వారిని పోలీసులు అడ్డుకున్నారు. అభ్యర్థి భర్తతోపాటు గ్రామ నాయకులను క్రోసూరు స్టేషన్‌కు తీసుకెళ్లి, అక్కడి నుంచి సత్తెనపల్లికి తరలించేందుకు ప్రయత్నించారని మహిళలు ఆందోళనకు దిగారు. పోలీసులు లాఠీలు ప్రయోగించడంతో పలువురు గాయపడ్డారని వైయస్సార్‌సీపీ నేతలు తెలిపారు. క్రోసూరు ఎస్సై రవికుమార్ బూటుకాలితో తన్ని జుట్టు లాగడంతో అన్నపురెడ్డి సీతారావమ్మ స్పృహ కోల్పోయారు. ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. తమ వాహనాల్లో పోలీసులే కర్రలు, రాళ్లు పెట్టారని కూడా ఆ పార్టీ నేతలు ఆరోపించారు.**
- సురభి, చక్రాయపేట మండలం: ఆనందరెడ్డికి గాయాలు. కర్రలు, రాడ్లతో గ్రామస్థులను భయపెట్టి, నామినేషన్ కేంద్రానికి వెళ్తున్న వైయస్సార్‌సీపీ మద్దతుదారులను టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారని స్థానిక నేతలు తెలిపారు. అక్కడ జరిగిన రాళ్ల దాడిలో బ్రహ్మదేవుని ఆనందరెడ్డి సహా కార్యకర్తలు గాయపడినట్లు వివరించారు.
- **చక్రాయపేట: పెట్రోల్ బాంబులు, సీసాలతో దాడి. వైయస్సార్‌సీపీ కార్యకర్తలపై పెట్రోల్ బాంబులు, సీసాలతో దాడి జరిగింది. పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు.**
- పాచులపాడు, కమలాపురం మండలం: రైతు నేతపై కర్రలతో దాడి. పంచాయతీ నామినేషన్ల సందర్భంగా వైయస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డిపై టీడీపీ వర్గీయులు కర్రలతో దాడి చేశారని పార్టీ నేతలు తెలిపారు.
- **బందర్లపల్లి, నంద్యాల జిల్లా: వార్డు అభ్యర్థిపై దాడి.. మహిళ పత్రాల చించివేత. కొలిమిగుండ్ల మండలంలో వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్న రామకృష్ణను నామినేషన్ వేయొద్దని టీడీపీ వర్గీయులు హెచ్చరించారని, పోటీ చేస్తామని చెప్పడంతో ఇళ్ల వద్దకు వచ్చి దాడి చేశారని వైయస్సార్‌సీపీ నేతలు తెలిపారు. అదే గ్రామంలో మరో మహిళా అభ్యర్థి నామినేషన్ పత్రాలు చించేశారని చెప్పారు. కనకాద్రిపల్లి, తుమ్మలపెంట అభ్యర్థులను అడ్డుకునేందుకు కూడా టీడీపీ శ్రేణులు మోహరించాయని ఫిర్యాదు చేశారు.**
- రొంపిచర్ల, చిత్తూరు జిల్లా: మాజీ జడ్పీటీసీపైనా దాడి. మాజీ జడ్పీటీసీ రెడ్డిశ్వర్‌రెడ్డి, నామినేషన్లకు వచ్చిన సర్పంచ్ అభ్యర్థులపై టీడీపీ వర్గీయులు దాడి చేశారని వైయస్సార్‌సీపీ నేతలు తెలిపారు. కేంద్రానికి తాళం వేస్తుంటే పోలీసులు చూస్తూ ఉండిపోయారని, నామినేషన్‌కు వస్తే కేసులు పెడతామని ఎస్సై బెదిరించారని ఆరోపించారు. అభ్యర్థులకు లోపలికి దారి కల్పించాలంటూ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించారు.
- **పులిచెర్ల, చిత్తూరు జిల్లా: కేంద్రం సమీపంలో అభ్యర్థుల అడ్డగింత. పుంగనూరు నియోజకవర్గంలోని పులిచెర్లలో నామినేషన్లకు వచ్చిన అభ్యర్థులను టీడీపీ శ్రేణులు అడ్డుకుని, కేంద్రం సమీపంలో దాడి చేశారని వైయస్సార్‌సీపీ నేతలు తెలిపారు.**
- సుంకేసుల, సింహాద్రిపురం మండలం: కేంద్రంలోకి అడుగుపెడుతుండగా పత్రాల చించివేత. వైయస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిపై టీడీపీ వర్గీయులు దాడి చేసి, చేతిలోని నామినేషన్ పత్రాలు చించేశారని స్థానిక నేతలు తెలిపారు. అడ్డుకోవాల్సిన పోలీసులు అక్కడి నుంచి పక్కకు తప్పుకున్నారని ఆరోపించారు.
- **వేంపల్లి: షబ్బీర్‌కు ముళ్లకంచె.. బిడాలమిట్ట రోడ్డుపై ధర్నా. సర్పంచ్ అభ్యర్థి షబ్బీర్ వలీతో నామినేషన్‌కు బయలుదేరిన వైయస్సార్‌సీపీ శ్రేణులను బిడాలమిట్ట రోడ్డులో పోలీసులు నిలిపివేశారు. కేంద్రం వద్ద ముళ్లకంచె ఏర్పాటు చేసి అభ్యర్థిని అడ్డుకున్నారని కార్యకర్తలు తెలిపారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి ఇంటి వద్ద ఉదయమే పోలీసులు మోహరించారు. ఆయన సోదరుడు, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి రోడ్డుపై కూర్చుని అభ్యర్థిని లోపలికి పంపాలని డిమాండ్ చేశారు.**
- వేంపల్లి నాలుగో సచివాలయం–ఈ. కొత్తపల్లి: అధికారపక్ష నేతలకు ప్రవేశంపై నిలదీత. వేంపల్లిలో నాలుగో సచివాలయం వద్ద రాళ్లు, కట్టెలు పోగుచేశారని, బీటెక్ రవి అనుచరులతో కేంద్రంలోకి వెళ్లినా పోలీసులు అడ్డుకోలేదని వైయస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అక్కడే ఉండటాన్నీ ప్రశ్నించారు. పులివెందుల మండలం ఈ.కొత్తపల్లి కేంద్రంలో టీడీపీ నేత పుష్పనాథ్‌రెడ్డి అనుచరులతో ఉన్నప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని తెలిపారు.
- **రామిరెడ్డిపల్లె, వేంపల్లి మండలం: ఐదు గ్రామాల కేంద్రంలో లాఠీచార్జి. రామిరెడ్డిపల్లె, ముత్తుకూరు, నాగూరు, పాములూరు, అయ్యవారిపల్లె అభ్యర్థులకు ఒకేచోట కేంద్రం ఏర్పాటు చేశారు. నామినేషన్ల సమయంలో నందిపల్లి మాజీ సర్పంచ్ మారం సులోచన కుమారుడు శ్రీకాంత్‌రెడ్డికి, టీడీపీ నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. ఇరువర్గాలను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీలు ప్రయోగించారు.**
- ఇడుపులపాయ–గోటూరు–అలవలపాడు–చాగలేరు: దారిలోనే అడ్డంకులు. ఇడుపులపాయ సర్పంచ్ అభ్యర్థిని, గోటూరు పంచాయతీ అభ్యర్థులను టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారని వైయస్సార్‌సీపీ నేతలు తెలిపారు. అలవలపాడు క్లస్టర్‌లో అభ్యర్థులను పోలీసులు, టీడీపీ శ్రేణులు నిలువరించారని ఆరోపించారు. వేముల మండలం చాగలేరులో తమ సానుభూతిపరులపై దాడి జరిగిందని తెలిపారు.
- **నాగులగుట్టపల్లి–కె.రాజుపల్లె, చక్రాయపేట మండలం: దుకాణాలు మూయించి.. కేంద్రం వద్ద పహారా. నాగులగుట్టపల్లిలో టీడీపీ వర్గీయులు దుకాణాలు మూయించి, వైయస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్‌కు రాకుండా అడ్డుకున్నారని స్థానిక నేతలు తెలిపారు. కె.రాజుపల్లెలో పోలీసులు, టీడీపీ వర్గీయులు కేంద్రం వద్దే ఉండి అభ్యర్థులను నిలువరించారని ఆరోపించారు.**
- కణంపల్లి–పులివెందుల: అర్ధరాత్రి ఇంటికొచ్చి సెల్‌ఫోన్లు లాక్కున్నారని ఫిర్యాదు. సర్పంచ్ అభ్యర్థి ఇంటికి వచ్చిన పోలీసులు భర్త ఎక్కడున్నాడని ప్రశ్నించారని, చిత్రీకరిస్తున్న వారి ఫోన్లు లాక్కున్నారని కణంపల్లి వాసులు ఎంపీ అవినాష్‌రెడ్డికి వివరించారు. తన ఇంటి వద్ద కూడా పోలీసులు మోహరించిన నేపథ్యంలో ఎంపీ సీఐ పురుషోత్తంరాజును ప్రశ్నించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని కోరారు.
- **మదూరు–మల్లెల, తొండూరు మండలం: అభ్యర్థి భర్త పోలీసుల అదుపులో.. గౌన్‌పై దాడి. మదూరులో సర్పంచ్ అభ్యర్థి భర్త శంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని వైయస్సార్‌సీపీ నేతలు తెలిపారు. మల్లెలలో గౌన్‌పై టీడీపీ వర్గీయులు దాడి చేశారని, వాహనం దగ్ధం ఘటనను తమ పార్టీపై మోపేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.**



వేములలో నామినేషన్ వేసేందుకు వెళ్తున్న అభ్యర్థులను అడ్డుకుంటున్న టీడీపీ గుండాలు.. రాళ్ల దాడికి దిగుతున్నా ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులు

- తెలికి–దేవతాపురం, సింహాద్రిపురం మండలం: ప్రతిపాదకుడినీ తీసుకెళ్లారని ఫిర్యాదు. తెలికి సర్పంచ్ అభ్యర్థి రమణయ్య, ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించే శివప్రతాప్, దేవతాపురానికి చెందిన బాబులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని వైయస్సార్‌సీపీ నేతలు తెలిపారు. మండల కన్వీనర్ శ్రీకాంత్‌ను కూడా పోలీసులు స్టేషన్‌కు తరలించారు.
- **బలపనూరు–లోమడ, సింహాద్రిపురం మండలం: బలపనూరు కేంద్రంలో పోలీసులు వైయస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులను అడ్డుకున్నారని, అక్కడికి వచ్చిన అంకాలమ్మగూడూరు సర్పంచ్ అభ్యర్థిని టీడీపీ వర్గీయులు అసభ్య పదజాలంతో దూషించారని స్థానిక నేతలు తెలిపారు. లోమడలో పోలీసులు, టీడీపీ మద్దతుదారులు కలిసి నామినేషన్లను అడ్డుకున్నారని ఆరోపించారు. సింహాద్రిపురం సచివాలయం గేటు దగ్గర రాళ్లు తెచ్చిపెట్టారని కూడా తెలిపారు.**
- దర్శి మండలం, ప్రకాశం జిల్లా: నాలుగు గ్రామాల్లో అడ్డంకులు. పోతవరంలో అభ్యర్థుల చేతుల్లోంచి నామినేషన్ కాగితాలు లాక్కొని చించేశారని వైయస్సార్‌సీపీ నేతలు తెలిపారు. తూర్పు చౌటపాలెంలో కేంద్రం మూసివేసి, కర్రలతో అభ్యర్థులను అడ్డుకున్నారని ఆరోపించారు. తానంచింతల, తుమ్మెద్దలపాడు గ్రామాల్లోనూ టీడీపీ వర్గీయులు అభ్యర్థులను నిలువరించారని తెలిపారు. కేంద్రాల వద్ద అభ్యర్థులు ధర్నాకు దిగారు.
- **మునుగోడు, పల్నాడు జిల్లా: నామినేషన్‌కు వెళ్తుండగా పోలీసులు నిలిపివేత. అమరావతి మండలం మునుగోడులో పత్రాలు సమర్పించేందుకు బయలుదేరిన వారిని పోలీసులు అడ్డుకున్నారని వైయస్సార్‌సీపీ నేతలు తెలిపారు.**
- ఇసుకపల్లె–గంగనపల్లె: టీడీపీపై బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఆరోపణ. పెండ్లిమర్రి మండలం ఇసుకపల్లె సర్పంచ్‌గా నామినేషన్‌కు వెళ్లిన లంకా చిన్నపరెడ్డిపై టీడీపీ శ్రేణులు దాడి చేశాయని బీజేపీ కడప జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి బుధవారం వెల్లడించారు. గంగనపల్లెలోనూ నామినేషన్‌కు వెళ్లిన బీజేపీ కార్యకర్తపై దాడి జరిగిందన్నారు. సుండుపల్లి మండలం చిన్నగొల్లపల్లెలో రెడ్డెప్పనాయుడిపై గతంలో జరిగిన దాడినీ ప్రస్తావించారు.
- **వెంకటగిరి: గెలిచిన ఎంపీటీసీలకూ బెదిరింపులు. ఎంపీపీ ఎన్నికకు ముందు ఇప్పటికే గెలిచిన వైయస్సార్‌సీపీ ఎంపీటీసీలను బెదిరిస్తున్నారని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఆరోపించారు. పరిషత్ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులపైనా దాడులు జరిగాయని పేర్కొన్నారు.**

కొనసాగిన గూండారాజ్



నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్న అనంతవరం వైఎస్సార్‌సీపీ నాయకులను నాగవరం వద్ద అడ్డుకున్న పోలీసులు, టీడీపీ గూండాలు.

చేతిలో పత్రాలు.. గేటు దగ్గరే అడ్డగింతలు

- ఉదవగండ్ల, తొండూరు మండలం: రాత్రి ఇళ్లపై రాళ్లు.. మహిళలకు గాయాలు. వైయస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై టీడీపీ వర్గీయులు రాళ్లు విసరడంతో పలువురు మహిళలు గాయపడ్డారు. కట్టెలు, రాడ్లతో గ్రామంలో తిరుగుతూ సానుభూతిపరులపై దాడి చేశారు.
- రాయలపేట, చిత్తూరు జిల్లా: అధికారి ఎదుటే హేమచంద్ర పత్రాల చించివేత. పెద్దపంజాణి మండలం రాయలపేటలో సర్పంచ్ అభ్యర్థి హేమచంద్ర పత్రాలు సమర్పిస్తుండగా టీడీపీ మద్దతు అభ్యర్థి రమణ వాటిని లాక్కొని చించేశారని వైయస్సార్‌సీపీ నేతలు తెలిపారు.
- నసనకోట, శ్రీ సత్యసాయి జిల్లా: కాంతప్ప నామినేషన్ చించేశారని ఆరోపణ. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత పంచాయతీలో వైయస్సార్‌సీపీ మద్దతుతో సర్పంచ్‌గా పోటీకి వచ్చిన కాంతప్పను ఆమె వర్గీయులు అడ్డుకుని పత్రాలు చించేశారని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఆరోపించారు. పంచాయతీని ఏకగ్రీవం చేసుకునేందుకే ఇలా వ్యవహరించారని మండిపడ్డారు.
- మహ్మదాపురం, కుప్పం మండలం: సర్పంచ్ అభ్యర్థికి గాయాలు. నామినేషన్‌కు వెళ్లిన వైయస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారని స్థానిక పార్టీ నేతలు తెలిపారు. ఇది టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మునిరత్నం సొంత పంచాయతీ అని పేర్కొన్నారు.
- ప్రకాశ్‌నగర్ కాలనీ, సంబేపల్లి మండలం: టీడీపీ నేత పత్రాలనూ చించేశారని నిరసన. సర్పంచ్ పదవికి నామినేషన్ వేసేందుకు వచ్చిన టీడీపీకి చెందిన గొల్లపల్లి సుబ్బారెడ్డిపై దాడి చేసి, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అనుచరులు పత్రాలు చించేశారు. తనను సర్పంచ్‌ను చేస్తామని చెప్పి, తీరా నామినేషన్ దగ్గర అడ్డుకున్నారని సుబ్బారెడ్డి కేంద్రం వద్దే నిరసన తెలిపారు.
- గాలివీడు, అన్నమయ్య జిల్లా: ఇద్దరు నేతలను వాహనాల్లో తిప్పారని ఆరోపణ. నామినేషన్ల చివరి రోజు ఉదయం వైయస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారణం చెప్పలేదని, ఏ స్టేషన్‌కు తీసుకెళ్తున్నారో తెలియనివ్వకుండా వాహనాల్లో తిప్పారని పార్టీ నేతలు ఆరోపించారు. రాయచోటిలో గడికోట శ్రీకాంత్‌రెడ్డిని, బాపట్లలో అంబటి మురళిని గృహనిర్బంధం చేశారని మల్లాది విష్ణు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు.
- ఇస్సాపాలెం-చిన్నతురకపాలెం, పల్నాడు జిల్లా: గ్రామం ప్రవేశం దగ్గరే అడ్డంకులు. నరసరావుపేట మండలం ఇస్సాపాలెంలో నామినేషన్ అడ్డుకున్నారని స్థానికుల నుంచి సమాచారం వచ్చింది. చిన్నతురకపాలెంలో ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన వైయస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులను, వారితో వచ్చిన నాయకులను కూటమి వర్గీయులు వెళ్లనివ్వలేదని పార్టీ నేతలు తెలిపారు. ఇదే సమయంలో గ్రామం ప్రవేశం వద్ద కర్రలు, రాళ్లతో అడ్డుకున్నారు. నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొనడంతో మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అక్కడికి వెళ్లారు.
- అయ్యన్నపాలెం, పల్నాడు జిల్లా: పోటీ నుంచి తప్పించేందుకు భూమి పేరిట నోటీసులా? బొల్లాపల్లి మండలంలో తాను సాగు చేస్తున్న పట్టా భూమికి తహసీల్దార్ ఫామ్-7 నోటీసు ఇచ్చారని మాజీ సర్పంచ్ పీపాల సాయిబాబా తెలిపారు. వైయస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా ఒత్తిడి తెచ్చేందుకే ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచనతో నోటీసు ఇచ్చారని ఆయన ఆరోపించారు.
- కావలి, నెల్లూరు జిల్లా: మాజీ ఎమ్మెల్యేపై దాడికి యత్నం. మున్సిపల్ ఆరో వార్డు వైయస్సార్‌సీపీ అభ్యర్థి నామినేషన్ పరిశీలన సందర్భంగా తోపులాట జరిగింది. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆర్వో కార్యాలయంలోకి వెళ్లారని, నామినేషన్ తిరస్కరణ ప్రయత్నాన్ని ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై టీడీపీ వర్గీయులు దాడికి ప్రయత్నించారని వైయస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. ప్రసన్నను పోలీసులు ఈడ్చుకెళ్లారని పేర్కొన్నారు.
- పొన్నూరు, గుంటూరు జిల్లా: బీబీజాన్ నాజర్ రెండు సెట్లూ తిరస్కరణ. వైయస్సార్‌సీపీ మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి బీబీజాన్ నాజర్‌తో ముందుజాగ్రత్తగా రెండు సెట్ల నామినేషన్లు వేయించినా రెండింటినీ తిరస్కరించారని పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తెలిపారు. కారణం అడిగేందుకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్తే పోలీసులు గేట్లు వేసి తనను నిలిపివేశారని, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఒత్తిడి ఉందని ఆరోపించారు.
- కందుకూరు: ఆమోదించామని చెప్పి మాట మార్చారని అభ్యర్థి ఆవేదన. ఆదిఆంధ్ర కాలనీ 14వ వార్డు వైయస్సార్‌సీపీ అభ్యర్థి నామినేషన్‌ను పరిశీలించి ఆమోదించినట్లు మొదట చెప్పారని, తర్వాత కమిషనర్ తిరస్కరించమన్నారని అధికారులు వెళ్లిపోయారని అభ్యర్థి వర్గీయులు తెలిపారు. కారణం చెప్పాలంటూ కాళ్లావేళ్లా పడినా వినలేదని ఆవేదన వ్యక్తం చేశారు.
- గుడివాడ, కృష్ణా జిల్లా: 7, 27 వార్డుల పరిశీలనపై రెండు అభ్యంతరాలు. వైయస్సార్‌సీపీ నామినేషన్ల తిరస్కరణకు ప్రయత్నిస్తున్నారని మల్లాది విష్ణు ఎస్ఈసీకి తెలిపారు. ఇదే వార్డుల్లో జనసేన, టీడీపీ అభ్యర్థుల దరఖాస్తులు అసంపూర్తిగా ఉన్నాయని జనసేన రెబల్ అభ్యర్థి అల్లూరు హేమంత్‌కుమార్ ఆర్వోకు వేరుగా ఫిర్యాదు చేశారు. తన అభ్యంతరంపై లిఖితపూర్వక నిర్ణయం కోరారు.
- మొగళ్లమూరు కేంద్రం, కోనసీమ జిల్లా: గడువు తర్వాత తుమ్మలపల్లి అభ్యర్థి పత్రాలపై వివాదం. సాయంత్రం ఆరు గంటలు దాటాక కూడా అధికారపక్ష అభ్యర్థి నామినేషన్ తీసుకున్నారని మాజీ ఎంపీ చింతా అనురాధ ఆరోపించారు. సీసీటీవీ దృశ్యాలు చూపాలని అడిగితే స్పందించలేదని, తన వెంట వచ్చిన కార్యకర్తలను పోలీసులు తరిమేశారని తెలిపారు. అధికారులు ఫుటేజీ పరిశీలిస్తామని చెప్పారు. డాక్టర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, చింతా అనురాధ తదితరులు రాత్రి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.
- వేంపల్లి-గండి-కర్ణపాపాయపల్లి: నామినేషన్లకు ముందురాత్రే ఆందోళన. వేంపల్లి నామినేషన్ కేంద్రాన్ని గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ఎంపీడీఓ కార్యాలయానికి మార్చినట్లు ఎంపీడీఓ కుళాయమ్మ వెల్లడించారు. ఆకస్మిక మార్పుపై స్థానికులు వివరణ కోరారు. సర్పంచ్ అభ్యర్థి షబ్బీర్ వలీ రైస్‌మిల్లును ఎన్నికల వేళ సీజ్ చేశారని ఎంపీ అవినాష్‌రెడ్డి ఆరోపించారు. అదే రాత్రి గండి, లింగాల మండలం కర్ణపాపాయపల్లి, సింహాద్రిపురం మండలానికి ఇతర ప్రాంతాల నుంచి బృందాలను తీసుకొచ్చారని వైయస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేశారు.
- మర్రిపూడి, ప్రకాశం జిల్లా: ఎస్సైని ప్రశ్నించిన మాజీ మంత్రిపై కేసు. నామినేషన్లు సజావుగా సాగేలా చూడాలని మర్రిపూడి ఎస్సై సుదర్శన్‌ను ప్రశ్నించిన మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌పై కేసు పెట్టారని వైయస్సార్‌సీపీ తెలిపింది. సింగరాయకొండ ఎస్సై ఎల్.సుధీర్‌కుమార్ నోటీసు ఇచ్చి సురేష్‌ను గృహనిర్బంధంలో ఉంచారని పేర్కొంది.

ఇన్ని అరాచకాలెందకు బాబూ?

పోటీకి దిగిన అభ్యర్థి చేతిలో నామినేషన్ పత్రాన్ని చించేస్తే, ఆ ఊరి ఓటరుకు ఎవరిని ఎన్నుకునే అవకాశం మిగులుతుంది? భద్రత కల్పించాల్సిన పోలీసులే అడ్డుకుంటే ఎవరికి చెప్పుకోవాలి? ఫిర్యాదులకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలి. కేంద్రాల వద్ద సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలి. దాడులకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి. అన్నింటికంటే ముందు, నామినేషన్ వేయలేకపోయిన, అడ్డగింతలకు గురైన ప్రతి అభ్యర్థికీ రక్షణ కల్పించి నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఇవ్వాలి. పంచాయతీ పీఠంపై ఎవరు కూర్చోవాలో తేల్చేది నామినేషన్ గేటు దగ్గర కర్ర పట్టుకున్న వ్యక్తి కాదు.. పోలింగ్ బూత్‌లో ఓటేసే గ్రామస్థుడని గుర్తుంచుకోవాలి.






పులివెందుల నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల నామినేషన్ల సందర్భంగా టీడీపీ శ్రేణుల దౌర్జన్యాలు, పోలీసుల జోక్యంపై ఉద్రిక్తత నెలకొంది. వేంపల్లి, పులివెందుల, తొండూరు, సింహాద్రిపురం, చక్రాయపేట మండలాల్లో వైయస్ఆర్‌సీపీ మద్దతుదారులు నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారు. వేంపల్లిలో వైయస్ఆర్‌సీపీ ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో పాటు, పలు ప్రాంతాల్లో పార్టీ నేతలు, సర్పంచ్ అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకున్నారు.

ఓబీసీలతో పాటు, సమగ్ర బీసీ కులగణన చేపట్టాలి

- ఆ దిశలో ఈనెల 28న ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో సభ
- అఖిల భారత కుల గణన సమన్వయ కమిటీ వెల్లడి
- సభకు హాజరు కావాలని వైయస్ జగన్‌కు ఆహ్వానం
- పార్టీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్‌ను కలిసిన కమిటీ సభ్యులు



తాడేపల్లి: కేంద్రం చేపడుతున్న కులగణనను సమగ్రంగా నిర్వహించడం ద్వారా బీసీలకు అన్యాయం జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కుల గణన సమన్వయ కమిటీ ఈనెల 28న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు సంఘీభావం ప్రకటించాలని కమిటీ ప్రతినిధులు మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌కు విజ్ఞప్తి చేశారు. 'ఛలో రాంలీలా మైదాన్' పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి వ్యక్తిగతంగా హాజరు కావాలని అభ్యర్థించేందుకు కమిటీ ప్రతినిధులు వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శ్రీ వైయస్ జగన్‌ను కలిశారు. మండల్ కమిషన్ ఛైర్మన్‌గా పని చేసిన బీపీ మండల్ మనవడైన ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్, అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గౌడ్ కిరణ్‌కుమార్, సకల్ ఓబీసీ మహామోర్చా అధ్యక్షుడు ఉమేష్ కుర్రం, డాక్టర్ పిట్టి మల్లికార్జున్‌యాదవ్‌తో పాటు, అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం నాయకులు రాకేష్‌దత్తా, పెండెం జయంతి యాదవ్ ఇంకా రజనీకాంత్ గౌడ్ శ్రీ వైయస్ జగన్‌ను కలిశారు. వైయస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఆ సమావేశంలో పాల్గొన్నారు. వైయస్ జగన్‌తో భేటీ అనంతరం అఖిల భారత కుల గణన సమన్వయ కమిటీ ప్రతినిధులు, వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎవరెవరు ఏం మాట్లాడారంటే..:

కులగణనలో సామాజిక పరిస్థితుల ఆధారంగా లెక్కలు తీయాలి : :కిరణ్ కుమార్. అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం జాతీయ అధ్యక్షుడు.

కులగణనలో ఓబీసీలతో సహా, అన్ని కులాల్ని లెక్కించాలన్న డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ఉన్న 60 ఓబీసీ సంఘాలతో అఖిల భారత కుల గణన సమన్వయ కమిటీ ఏర్పడింది. ఇందులో మధ్యప్రదేశ్ నుంచి ఓబీసీ మహాసభ, మహారాష్ట్ర నుంచి సకల్ ఓబీసీ మహాసంఘ్, కర్నాటక నుంచి ఓబీసీ ఫెడరేషన్, తమిళనాడు నుంచి రైట్స్ ఫర్ ద ఓబీసీ పార్టీస్ ఇలా.. కాశ్మీర్ నుంచి కేరళ వరకూ ఉన్న ఓబీసీ సంఘాలన్నీఇందులో భాగస్వాములవుతున్నాయి. ఎస్సీ, ఎస్టీల తరహాలోనే బీసీల్లో అన్ని కులాల్ని లెక్కించేందుకు వీలుగా డ్రాప్ డౌన్ ఆప్షన్ అమలు చేయాలని మేం కోరుతున్నాం. రాంలీలా మైదానంలో నిర్వహించబోతున్న ర్యాలీలో ఎన్డీయే కూటమి కాకుండా మిగతా పార్టీలన్నింటినీ కలుస్తున్నాం. అందులో భాగంగానే జగన్‌గారిని కూడా ఆహ్వానించాం. బీసీలకు 50 శాతం సీలింగ్ బ్రేక్ కావాలంటే కుల గణనలో సామాజిక పరిస్థితుల ఆధారంగా లెక్కలు తీయాల్సిందే. జనగణన ద్వారా పూర్తి డేటా బయటికి వస్తే కోర్టుల్లో రిజర్వేషన్లకు రక్షణ దొరుకుతుంది.

కులగణనలో ఓబీసీ కాలమ్ చేర్చాలి : ప్రొ. సూరజ్ మండల్. ఏఐసీసీసీసీ ప్రతినిధి.

నవంబర్ 28న ఢిల్లీ రాంలీలా మైదానంలో అఖిల భారత కుల గణన సమన్వయ కమిటీ ఓ బహిరంగ సభ నిర్వహిస్తోంది. ఇందులో మేం కులగణన సమగ్రంగా నిర్వహించాలని, ఇందులో ఓబీసీ కాలం చేర్చాలని, ఓబీసీ కులాల డ్రాప్ డౌన్ మెన్యూ చేర్చాలని డిమాండ్ చేయబోతున్నాం. ఇవన్నీ జరిగితేనే ఓబీసీ కులాల అసలు లెక్కలు బయట పడటమే కాకుండా, వారికి రిజర్వేషన్ ఫలాలు లభిస్తాయి. ఏపీలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల డేటా లేకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజర్వేషన్ పెంచేందుకు అనుమతి ఇవ్వలేదు. కాబట్టి ఢిల్లీలో మేం నిర్వహిస్తున్న భారీ సభకు జగన్‌గారిని ఆహ్వానించాం. మా డిమాండ్‌కు అండగా నిలవాలని ఆయన్ను కోరాం. ఎప్పుడూ బీసీలకు అండగా నిల్చే జగన్‌గారు, వెంటనే సానుకూలంగా స్పందించారు.

ఉదయగిరిలో ప్రజాతీర్పు తారుమారు

- నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- వైయస్ఆర్‌సీపీ నేత మేకపాటి అభినవ్ రెడ్డి



నెల్లూరు జిల్లా: ఉదయగిరి నియోజకవర్గంలో ప్రజాస్వామ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైయస్ఆర్‌సీపీ నేత మేకపాటి అభినవ్‌రెడ్డి అన్నారు. పలు ఎన్‌పీటీసీ, జెడ్‌పీటీసీ స్థానాల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చినా ఫలితాలను నిలిపివేయడం, ఎన్నికల అధికారులు ఫలితాలను తారుమారు చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి మీడియాను అనుమతించకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ప్రజాతీర్పును అధికారిక ప్రకటనలతో మార్చలేరని అభినవ్‌రెడ్డి స్పష్టం చేశారు. అధికారికంగా విజయం ప్రకటించినంత మాత్రాన ప్రజల విశ్వాసాన్ని సృష్టించలేరని, ఉదయగిరి ప్రజలు జరిగిన పరిణామాలను మరచిపోరని అన్నారు. వైయస్ఆర్‌సీపీ తరఫున పోటీ చేసిన 83 ఎన్‌పీటీసీ, 8 జెడ్‌పీటీసీ అభ్యర్థులు తీవ్ర ఒత్తిళ్లు, బెదిరింపుల మధ్య ధైర్యంగా పోరాడారని, గెలిచిన చోట స్పష్టమైన మెజారిటీలతో గెలిచామని, ఓడిన చోట కూడా స్వల్ప తేడాలతోనే ఫలితాలు వచ్చాయని తెలిపారు.

నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లనివ్వకుండా దాడి



- మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆగ్రహం

పల్నాడు జిల్లా: పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మండలం అనంతరం గ్రామంలో నామినేషన్ల సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలను నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. పోలీసుల దాడిలో పలువురు గాయపడ్డారని, నామినేషన్ కేంద్రాల వద్ద టీడీపీ వర్గాలను ఉంచి దాడులు చేయించారని ఆయన పేర్కొన్నారు. క్రోసూరు ఎస్ఐ దాడిలో గాయపడి సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలను నంబూరు శంకరరావు పరామర్శించారు. బాధితులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసి సత్తెనపల్లికి తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సత్తెనపల్లి డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా, అదనపు ఎస్పీ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయన తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని నంబూరు శంకరరావు కోరారు.

అమలాపురంలో ఎన్నికల అక్రమాలపై అర్ధరాత్రి వరకు పోరాటం

- తుమ్మలపల్లిలో గడువు ముగిసిన తర్వాత నామినేషన్ స్వీకరణపై డాక్టర్ పినిపే శ్రీకాంత్ నిరసన



అమలాపురం: అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసిన తర్వాత టీడీపీ మాజీ సర్పంచ్ నామినేషన్ దాఖలు చేయడంపై అమలాపురం నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ స్వీకరించారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేస్తూ అర్ధరాత్రి 11 గంటల సమయంలోనూ నిరసన కొనసాగించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిబంధనలకు విరుద్ధంగా జరిగిన నామినేషన్ ప్రక్రియపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మ ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, మండల నాయకులు, వైయస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

Social Buzz







